సాక్షి
ఖమ్మం
గురువారం । 1 । మే । 2025
I

గరిష్టం / కనిష్టం
40° / 25°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశముంది.

అదే ర్యాంక్.. పెరిగిన శాతం

- ఎస్సెస్సీ ఫలితాల్లో బాలికలదే హవా
- రాష్ట్రంలో 21వ స్థానాన నిలిచిన జిల్లా
- గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ ఉత్తీర్ణత

పదో తరగతి ఫలితాలు ఇలా...

కేటగిరి	విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం
బాలురు	8,408	7,858	93.46
బాలికలు	7,983	7,627	95.54
మొత్తం	16,391	15,485	94.47

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సైతం ఉత్తమ మార్కులు సాధించగా, ప్రైవేట్ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి. గతేడాది జీపీఏ గ్రేడింగ్ విధానంలో ఫలితాలు వెల్లడించిన ప్రభుత్వం, ఈసారి మార్కుల వారీగా విడుదల చేసింది. బుధవారం మధ్యాహ్నం ఫలితాలు వెల్లడి కాగానే విద్యార్థులు ఆన్‌లైన్‌లో చూసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఏటా మాదిరిగానే ఈసారి సైతం బాలురతో పోలిస్తే బాలికలు ఉత్తీర్ణతలో ముందు నిలిచారు.

94.47శాతం ఉత్తీర్ణత

ఈ ఏడాది జిల్లా నుంచి 16,391మంది ఎస్సెస్సీ పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 15,485మంది ఉత్తీర్ణత సాధించగా 94.47శాతంతో రాష్ట్రస్థాయిలో జిల్లాకు 21వ స్థానం దక్కింది. గత ఏడాది 92.24శాతం ఉత్తీర్ణతతో 21వ స్థానంలో నిలిచింది. ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగినా ర్యాంక్ మాత్రం 21తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాగా, ఎప్పటిలాగే ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. అయితే, కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదవడం విశేషం.

గురుకుల విద్యార్థుల ప్రతిభ


593 మార్కులు సాధించిన దుర్గాభవాని

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ సంక్షేమ గురుకులాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దానవాయిగూడెం ఎంజేపీబీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని టి.దుర్గాభవాని 593 మార్కులతో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. జిల్లాలోని 22బీసీ గురుకులాల నుంచి 1,351 మంది పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 1,314 మంది ఉత్తీర్ణత(97.26 శాతం) సాధించారని.. పది గురుకులాల్లో వంద శాతం మంది పాస్ అయ్యారని ఆర్‌సీఓ సీహెచ్.రాంబాబు తెలిపారు. ఇక జిల్లాలోని 12 ఎస్సీ గురుకులాలకు గాను 923 మంది పదో తరగతి విద్యార్థులకు 900 మంది (97.50శాతం) ఉత్తీర్ణత సాధించారు. కల్లూరు, ఎర్రుపాలెం, కూసుమంచి, ముదిగొండ గురుకుల పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే, ఏడు మైనార్టీ గురుకులాల నుంచి 367 మంది ఎస్సెస్సీ పరీక్షలకు హాజరుకాగా, 350 మంది(95.36 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మైనార్టీ గురుకులాల విభాగంలో ఖమ్మం గర్ల్స్–2, మధిర బాయ్స్–1 గురుకుల పాఠశాలల నుంచి పరీక్షలకు హాజరైన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

తండ్రి చనిపోయిన దుఃఖంలోనూ...


వి.చస్మిత

కల్లూరు: కల్లూరు బాలికోన్నత పాఠశాలకు చెందిన వన్నారపు చస్మిత 545మార్కులతో ఆ పాఠశాల టాపర్‌గా నిలిచింది. పరీక్షలు జరుగుతున్న సమయాన ఆమె తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. పంటి బిగువన బాధను భరిస్తూ పరీక్షలు రాసింది. ఈనేపథ్యాన టాపర్‌గా నిలిచిన చస్మితను పలువురు అభినందించారు.

'మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ'


సభలో మాట్లాడుతున్న వక్త

మధిర: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ మత విద్వేషాలు రగిలించడమే కాక హిందూ దేశం స్థాపనకు యత్నిస్తోందని ప్రొఫెసర్ డాక్టర్ రామ్ పునియాని విమర్శించారు. మధిరలో ముస్లిం ఐక్య సంఘం అధ్యక్షుడు ముజాహిద్ ఇషాతి, ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్ అధ్యక్షతన బుధవారం ఈద్ మిలాప్‌తో పాటు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సభ నిర్వహించారు. ఈ సభలో రామ్ పునియానీ మాట్లాడుతూ 11ఏళ్లుగా అధికారం చెలాయిస్తూ మనుధర్మం తీసుకురావడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇది హిందూ, ముస్లింలకే కాక అందరికీ ప్రమాదమేనని తెలిపారు. అనంతరం రాంపూర్(ఉత్తరప్రదేశ్) ఎంపీ మోహిబ్బుల్లా నద్వీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని చెప్పారు. జేఎన్టీయూ ప్రొఫెసర్ హఫీజ్జుల్ రెహమాన్ తదితరులు మాట్లాడగా మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీక్ అన్సారీ, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావుతో పాటు పోతినేని సుదర్శన్, అంజాతుల్లా ఖాన్ ఖలీద్, సయీద్ అహ్మద్ ఖాస్మీ, అసాద్, ఇలియాస్, ముఫ్తీ జలాలుద్దీన్, ఖాదర్, జవ్వాద్ అహ్మద్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మరింత వేగంగా ధాన్యం కొనుగోళ్లు

ఖమ్మంసహకారనగర్: యాసంగి పంటల కొనుగోళ్లలో వేగం పెంచాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఆయన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్‌తో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న 15–20 రోజులు ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ధాన్యం కాంటా వేయిస్తూ మిల్లులకు తరలించాలని సూచించారు. కొన్ని రకాల ధాన్యాన్ని నిరాకరించడమే కాక తరుగు తీస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా నుంచి వీసీకి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి, డీఆర్డీవో సన్యాసయ్య, డీసీఎస్‌ఓ చందన్‌కుమార్, డీఎం శ్రీలత, డీఎంఓ అలీమ్, డీసీఓ గంగాధర్ హాజరయ్యారు.

రైతులకు ఇబ్బందులు ఎదురుకావొద్దు

ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఇబ్బంది పడకుండా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ నిర్దేశిత తేమ రాగానే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించడమే కాక ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కేంద్రాల వద్ద ఇంకా 22వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు తెలుస్తుండగా, వేగం పెంచాలన్నారు. విద్యుత్ ఎస్‌ఈ శ్రీనివాసాచారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత, డీసీఓ గంగాధర్, ఆర్డీఓ రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేగొమ్మలో రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న రైతులు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ రైతులు బుధవారం ఖమ్మం–సూర్యాపేట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రహదారిపై చెట్ల కొమ్మలు అడ్డుగా వేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈమేరకు ఏఓ వాణి, ఎస్సై నాగరాజు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొనుగోళ్లు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, రైతుల ఇబ్బందులను సీపీఎం నాయకులు కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వివరించగా ఆయన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచడంతో పాటు సరిపడా గన్నీబ్యాగ్‌లు సమకూర్చాలని సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఫీజు చెల్లించే గడువును ప్రభుత్వం ఈనెల 3వ తేదీ వరకు పొడిగించింది. ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ కల్పిస్తూ రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 31వ తేదీతో గడువు ముగియగా, ఏప్రిల్ 30 వరకు పొడిగించారు. మరోసారి మూడు రోజుల పాటు పొడిగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి టీ.కే.శ్రీదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, రూ.50.13కోట్ల ఫీజు వసూళ్లతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రంలో మూడో స్థానాన నిలిచింది. ప్రస్తుతం గడువు పొడిగించిన నేపథ్యాన కేఎంసీ సహా ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల నుండి మరింత ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

మాటలు తప్ప చేతల్లో కనిపించని అభివృద్ధి

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లు మాధవి

ఖమ్మం మామిళ్లగూడెం: మాయమాటలతో జనాన్ని మభ్యపెట్టడంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌ను మించిపోయారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లు మాధవి ఎద్దేవా చేశారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి జరగడం లేదని తెలిపారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు రాకపోగా, ఏ హామీ కూడా నెరవేర్చలేకపోయారని ఆరోపించారు. కాగా, పహల్గాం దాడితో రహదారిపై పాకిస్తాన్ జెండాలు అతికించి తొక్కుతూ నిరసన తెలిపారు. తొలుత ఆమె రాపర్తినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, మంద సరస్వతి, సుధాకర్, నీరుకొండ ఉషారాణి, మేకల నాగేందర్, వీరూగౌడ్, నల్లగట్టు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సత్తా

ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అత్యుత్తమ మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఈమేరకు విద్యార్థులను పాఠశాలల యాజమాన్యాలు అభినందించి వివరాలను వెల్లడించాయి.

– ఖమ్మం సహకారనగర్

హార్వెస్ట్ విజయభేరి



విద్యార్థులతో కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

పదో తరగతిలో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. జి.జ్యోత్స్న 565మార్కులు, జి.సుభాష్‌చంద్ర 564, కె.జస్విత 561, డి.వేదర్ష 558, ఎ.మౌక్తిక 557, జె.సంపత్‌కుమార్ 557మార్కులు సాధించగా.. 59మంది విద్యార్థులు 500కిపైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు.

సర్వజ్ఞ ప్రభంజనం



విద్యార్థులతో డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ

పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ.నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. ఆర్.వేద వందన 588మార్కులు, బి.తరుణ్ 580, జి.మేధశ్రీ 569, వై.అనితర 566, పి.స్నిగ్ధ 562, డి.శుభాంగి 561మార్కులు సాధించగా.. మిగతా వారు మంచి మార్కులు సాధించారన్నారు.

బేబీమూన్‌లో ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ వీరన్న

ఖమ్మంలోని బేబీమూన్ విద్యార్థులు ఎస్సెస్సీ అసాధారణ ఫలితాలు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ కేసా వీరన్న తెలిపారు. హాస్యప్రియ 555 మార్కులు, శాంతిశరణ్య 554, నక్షత్ర 552 మార్కులు పొందారని వెల్లడించారు. వీరిని కరస్పాండెంట్‌తోపాటు డైరెక్టర్ కేసా భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

విన్‌ఫీల్డ్ ప్రతిభ



విద్యార్థులతో పుల్లారావు, కిషోర్‌కుమార్, శ్రీకాంత్

పదో తరగతిలో తమ విద్యార్థులు విజయభేరి మోగించారని విన్‌ఫీల్డ్ పాఠశాల యజమాన్యం గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ తెలిపారు. బి.ఉదయ్‌కుమార్ 581, డి.నటాషా 576మార్కులు సాధించగా, 500కుపైగా మార్కులు 79మంది విద్యార్థులు సాధించారని, 70శాతం మార్కులకుపైగా సాధించిన వారు 135మంది ఉన్నారని పేర్కొన్నారు. వీరిని యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూవిజన్ విజయదుందుభి



విద్యార్థులతో చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు

ఎస్సెస్సీ పరీక్షలకు తమ పాఠశాల నుంచి 494మంది హాజరు కాగా, 184మంది 600 మార్కులకు గాను 550కి పైగా మార్కులు సాధించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్, డైరెక్టర్ గోపీచంద్ తెలిపారు. అలాగే, 500 – 449 మధ్య మార్కులు 215 మంది సాధించగా, మిగిలిన వారంతా 400కు పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. 52 మంది విద్యార్థులు గణితంతో వంద మార్కులు సాధించారన్నారు. పాఠశాల ప్రిన్సిపాళ్లు ఎం.డీ.ఆబాద్ అలీ, జే.వీ.మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

రెజొనెన్స్ శ్రీనగర్ విజయకేతనం



విద్యార్థులతో డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి

ఎస్సెస్సీ ఫలితాల్లో శ్రీనగర్ కాలనీ రెజొనెన్స్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. ఎం.డీ.సుమయ ఫిర్దౌస్ మార్కులకు 578, డి.రుష్విణి 577, బి.ప్రతిభ 575, కె.గాయత్రి తన్విష 574, ఎస్.కే.అష్రఫ్, డి.శ్రీవల్లి 573, సీహెచ్.హాసిని 572, కె.ప్రణవ్ 571 మార్కులు సాధించగా.. 550పైగా 15 మంది, 540పైగా 28 మంది, 520కి పైగా 40 మంది, 500 మార్కులకు పైగా 57 మంది పొందారని తెలిపారు. విద్యార్థులను శ్రీధర్‌రావుతో పాటు మరో డెరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

గీతాంజలి విద్యార్థుల జైత్రయాత్ర



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ అప్పారావు

పదో తరగతి ఫలితాల్లో శ్రీనివాసనగర్‌లోని గీతాంజలి విద్యానికేతన్ విద్యార్థులు జైత్రయాత్ర సాగించారని కరస్పాండెంట్ టీవీ.అప్పారావు తెలిపారు. డి.బిందుప్రియ 590మార్కులతో అగ్రభాగాన నిలవగా, పి.ఫణీంద్ర 574, పి.ఉజ్వల 570, జి.వేదశ్రీ 566, ఎన్.దీపిక 563, పీహెచ్ఎస్.మణికంఠ 557, డి.నామ సహస్ర 556, సీహెచ్.జ్యోత్స్న 551, ఎస్.జోషిత్ సాయివర్మ 550, సీహెచ్.సౌజన్య 550 మార్కులు సాధించారని, 550 మార్కులకు పైగా 10 మంది, 500కుపైగా 31 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు డైరెక్టర్లు టి.పద్మ, టి.అరుణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిర్మల్ హృదయ్‌లో అద్భుత ఫలితాలు

ఎస్సెస్సీలో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని నిర్మల్ హృదయ్ పాఠశాల కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి తెలిపారు. లక్ష్మీ నివేదిత 581మార్కులు, ఎం.డిరియా 759 మార్కులు సాధించగా.. 12మంది 550కిపైగా మార్కులు, 53మంది విద్యార్థులు 500మార్కులకు పైగా సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్ వి.సుధాకర్‌రెడ్డి, హెచ్ఎం పద్మజ, వి.శ్రావణి ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం, ఉపాధ్యాయులు

రెజొనెన్స్ విద్యార్థుల సత్తా



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మం వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ విద్యార్థులు మార్కుల ప్రభంజనం సృష్టించారని డైరెక్టర్లు నీలిమ, ఆర్.వీ.నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. జి.జ్ఞానదీప్తి 578 మార్కులు, జి.జస్విత 578, సీహెచ్ వెంకటసాయిశబరి 571, డి.రుత్విక 563, బి.ఉదయశ్రీ 562, ఆయేషా 561, ఠాగూర్ 561, లోకేష్ 560, వినీష్ 558, సాయితేజ 554, మోక్ష 554, అక్షిత్ చౌదరి 553, శ్రీవల్లి 551, సాద్వితేజ 548, రమ్య 548, మీర్జా 546, ఎ.చైతన్య 543, కె.తాప్సీప్రియ 534, జి.నరేష్ 533, పి.పృథ్వీ 533, వి.సాత్విక్ 531 మార్కులు సాధించగా. డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీచైతన్య ప్రభంజనం



విజయకేతనం చూపిస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య, విద్యార్థులు

పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. 600మార్కులకు ముత్యాల అఖిలేష్ 592మార్కులు, మనోజ్ఞ 568, వర్ష ప్రసూన 585, నక్కా విశాల్ 584, జిల్లెల శ్రీవిద్య 583, సాయి అంజని 583, ఉమేష్ చంద్ర, వర్షిని, సాయి నాగశారణ్య, యశస్విని 582, అక్షయ, అక్షర, లక్ష్మీతనూజ 581, శేరిన, బాల త్రిలోక్య, అక్షయ 580మార్కులు సాధించారన్నారు. చైర్మన్, డైరెక్టర్‌తో పాటు డీజీఎం చేతన్‌మాధూర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ టీఎల్ఎన్.శర్మ, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, ఐపీఎల్ ఇన్‌చార్జ్‌రాజశేఖర్‌రెడ్డి, డీన్ కేవీఆర్ అభినందించారు.

న్యూఇరా ప్రతిభ



విద్యార్థులతో చైర్మన్ రమణారావు, డైరెక్టర్ భూమేశ్వరరావు

పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు విజయదుందుభి మోగించారని న్యూ ఇరా విద్యాసంస్థల చైర్మన్ ఐ.వీ.రమణారావు, డైరెక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. మొత్తం 165 మంది పరీక్ష రాయగా, డి.రుచిత 588, ఎం.వినీత్ 580, బి.హారిక 563, శ్రీవిద్య 562 మార్కులు సాధించారన్నారు. మరో 52 మంది 500కు పైగా, ప్రతీ ముగ్గురిలో ఒకరికి 500కు పైగా మార్కులు వచ్చాయని తెలిపారు. విద్యార్థులను చైర్మన్, డైరెక్టర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సెస్సీ ఫలితాల్లో 'త్రివేణి' హవా

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు అత్యధిక మార్కులతో విజయదుందుభి మోగించారని త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి ఓ ప్రకటనలో వెల్లడించారు. అన్ని బ్రాంచ్‌ల్లో తమ విద్యార్థులు 600కు 593 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. అలాగే, 593, 590, 587, 587, 587, 586, 586, 586, 586, 584, 583, 583, 583, 582, 582, 581, 581, 581, 581, 580, 580, 580 మార్కులతో అగ్రగామిగా నిలవగా.. 570కి పైగా 61మంది విద్యార్థులు, 550 మార్కులకు పైగా 200మంది, 500కు పైగా మార్కులు 686 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. గ్రేడ్ల విధానంలోనైనా, ఇప్పుడు మార్కుల విధానంలోనైనా తమ విద్యార్థులకు తిరుగులేదని, వంద శాతం ఉత్తీర్ణతతో మరోసారి తెలంగాణలో మొదటి స్థానం దక్కించుకున్నామని వెల్లడించారు. హైదరాబాద్, ఖమ్మం, కొత్తగూడెం బ్రాంచ్‌ల్లో విజయం సాధించిన విద్యార్థులు, ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

'ఎర్లీబర్డ్'తో కేఎంసీకి రూ.9.69 కోట్లు

ఖమ్మంమయూరిసెంటర్: ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఎర్లీ బర్డ్ పథకం ద్వారా ఐదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు కలిసొచ్చింది. ఎర్లీబర్డ్ పథకం బుధవారం ముగియగా కేఎంసీకి రూ.9.78 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సెల్ఫ్ అసెస్‌మెంట్ల ద్వారా రూ.9.68 లక్షలు, పన్నుల చెల్లింపు ద్వారా రూ.9.69 కోట్లు ఆదాయం నమోదైంది. మొత్తం 15,500 భవనాలకు సంబంధించిన పన్ను యజమానులు చెల్లించారు. 2024 ఏప్రిల్‌లో ప్రకటించిన ఎర్లీబర్డ్ స్కీం ద్వారా కేఎంసీకి రూ.9.25 కోట్లు రాగా.. ఈ ఏడాది అది రూ.9.69 కోట్లకు పెరిగింది. కాగా, చివరి రోజైన బుధవారం రూ.1.17 కోట్ల మేర పన్నులను కేఎంసీ ఉద్యోగులు వసూలు చేశారు.

చికిత్స పొందుతున్న మరో చిన్నారి మృతి

ఇద్దరు కుమారుల మృతితో తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

తల్లాడ: మండలంలోని మిట్టపల్లిలో గ్యాస్ సిలిండర్ లీకేజీతో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరగగా, తీవ్రంగా గాయపడిన గుత్తికొండ వరుణ్(7) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనలో వరుణ్ కవల సోదరుడు తరుణ్, వారి తండ్రి వినోద్ నాయనమ్మ సుశీల మంగళవారం మృతి చెందిన విషయం విదితమే. కాగా, ప్రమాదంలో గాయపడిన వినోద్, ఆయన మేనకోడళ్లు ప్రిన్సీ, లింసీ చికిత్స పొందుతున్నారు. తరుణ్, సుశీల మృతదేహాలు మధ్యాహ్నం, వరుణ్ మృతదేహం రాత్రి మిట్టపల్లికి చేరుకోగా పిల్లల తల్లి రేవతి సహా బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినోద్‌ను తీసుకొచ్చి ఆయన నాయనమ్మ, ఇద్దరు కుమారుల అంత్యక్రియలను స్థానికుల సహకారంతో జరిపించారు.

నీట మునిగి వ్యక్తి మృతి

ముదిగొండ: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన మల్లారంలో చోటుచేసుకుంది. వల్లభికి చెందిన వేముల గోపి (38) తన కుమారుడు ఉపేందర్, మరొకరితో కలిసి మల్లారం చెరువులో చేపల వేటకు వెళ్లగా.. వేముల గోపి నీటిలో మునిగాడు. ఆయనను బయటకు తీసేలోపే మృతి చెందాడు.

సాక్షి ఫ్యామిలీ IV
నిర్వహణ: నిర్మలా రెడ్డి
ఖమ్మం
గురువారం ॥ 1-5-2025

సమ్మర్ సమతుల్యత

వయసుల వారీగా డైట్ చక్ర

టీనేజ్, యవ్వనం, గర్భధారణ, పిల్లలకు పాలు ఇవ్వడం, మెనోపాజ్, వయసు పైబడటం.. వంటి దశల ఆధారంగా పోషక అవసరాలు మారుతుంటాయి. కానీ, మన ఇళ్లలో సాధారణంగా అందరికీ ఒకేతరహా వంటను వండుతుంటాం. దీనివల్ల వయసుల వారీగా సరైన పోషకాలు శరీరానికి అందక, శక్తి సన్నగిల్లుతుంది. దీంతో చురుకుదనం తగ్గుతుంది. ఫలితం చేసే పనులపై ప్రభావం చూపుతుంది. అందుకని పోషకాహార చక్రం ఎవరికి వారు, వయసుల వారీగా ఆరోగ్యదాయకంగా మార్చుకోవడం ఈ రోజుల్లో తప్పనిసరి.



రోజూ ఉదయం నుంచి వంటింట్లో చెమటలు కక్కుతూ వంటకాలతో కుస్తీ పడుతుంటుంది అమ్మ. 'నీరసంగా ఉంటోంది.. ఏ పనీ చేయాలనిపించడం లేదు' అని అంటూనే లేని ఓపికను తెచ్చుకొని పనులు చేస్తూనే ఉంటుంది. 'కాళ్ల నొప్పులు.. కదలనివ్వడం లేదు' అంటూ కూర్చున్న చోటు నుంచి లేవలేకపోతుంటుంది బామ్మ. కాలేజీ నుంచి వస్తూనే 'బ్యాగ్ కూడా మోయలేను.. అలసటగా ఉంది' అంటూ సోఫాలో కూలబడిపోతుంది కూతురు. రోజూ మూడుపూటలా తింటూనే ఉన్నాం, అయినా ఎందుకిలా?! ఏ ఆరోగ్య సమస్యనో అని వైద్యులను కలిస్తే 'పోషకాహారం తీసుకోండి' అని చెబుతుంటారు. మన శరీరానికి ఏయే పోషకాలు అవసరం, సీజన్‌కి తగినట్టు మన ఆహారపు అలవాట్లను ఎలా మార్చుకోవాలి. సింపుల్‌గా హెల్దీ వంటకాలను ఎలా తయారు చేసుకోవచ్చు... ఈ వివరాలతో వరుస కథనాలు



అ... అమ్మ ఆ... ఆహారం



మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు సంబంధించి సమతులాహారం తీసుకోవడంలో జాగ్రత్తలు పెరిగాయి. కానీ, మన రొటీన్ ఫుడ్ మాత్రం అలాగే ఉంటోంది. హార్మోన్ల సమతుల్యతకు, శక్తికి తినే ఆహారం చాలా ముఖ్యమైనది. సాధారణంగా మహిళలు తీసుకునే ఆహారంలో ఉండాల్సినవి ఐరన్, కాల్షియం, విటమిన్లు, ప్రొటీన్లు.

శక్తికి ఇనుము... రక్తంలో ఐరన్ శాతం తగ్గితే బలహీనం అవుతారు. త్వరగా అలసిపోతారు. రక్తస్రావం అధికం అవుతుంది. తలనొప్పి, జుట్టు రాలడం వంటి సమస్యలు తలెత్తుతాయి. బచ్చలి, పాలకూర, తోటకూర. గోంగూర వంటి ఆకుకూరలు, బీట్‌రూట్, చిక్కుళ్ళు, శెనగ, మటన్, పెసలు, నట్స్, ఎండు ఖర్జూరాలు, ఎండు ద్రాక్ష, తృణధాన్యాలు, గుడ్డు.. వంటివి శరీరంలో ఐరన్ శాతం పెరగడానికి సహాయపడతాయి. ఒక వ్యక్తి రోజువారీగా అవసరమైన ఐరన్ మోతాదు వారి వయసు, జెండర్‌పై ఆధారపడి ఉంటుంది. గర్భిణులు, బాలికలకు రోజూ 18 మిల్లీగ్రాముల ఐరన్ అవసరం. దీంతో పాటు విటమిన్-సి ఉండే నారింజ, బత్తాయి వంటి సిట్రస్ పండ్లు, రసాలు తీసుకోవడం వల్ల ఒంట్లో ఇనుము శోషణ పెరుగుతుంది.

పాల ఉత్పత్తులతో కాల్షియం... ఎముకల బలానికి,,, ప్రత్యేకంగా మెనోపాజ్ దశలో కాల్షియం అవసరం అధికం. అందుకు పాల ఉత్పత్తులు, బాదం, శనగలు, కాలీఫ్లవర్ .. వంటివి తినాలి. ● గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో ఫోలిక్ యాసిడ్ అవసరం ఎక్కువ. ఆకుకూరలు, మాంసం, దాల్చిన చెక్క.. వంటి వాటి నుంచి ఫోలిక్ యాసిడ్ లభిస్తుంది ● ఒమేగా-3 ఫ్యాటి యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హార్మోన్ల సమతుల్యతకు ఉపయోగ పడతాయి. ఫ్లాక్స్ సీడ్స్, వాల్‌నట్స్, చేపల నుంచి ఈ ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి ● శరీర బలానికి, కండరాల పెంపుకు ప్రొటీన్లు చాలా అవసరం. మినపపప్పు, చికెన్, గుడ్లు, నట్స్... నుంచి ప్రొటీన్లు లభిస్తాయి ● జీర్ణ వ్యవస్థ సజావుగా పనిచేయడానికి ఫైబర్ చాలా అవసరం. గోధుమ, మొక్కజొన్న, పండ్లు, కూరగాయల నుంచి లభిస్తుంది.





- డా.బి. జానకి
పోషకాహార నిపుణులు



1 బాల్యం నుంచి యవ్వనం (8-18 ఏళ్లు) వరకు

శరీరం వృద్ధి చెందడానికి, హార్మోన్ల సమతుల్యతకు, ఎముకల బలానికి ... పాల ఉత్పత్తులు, బాదం, ఆకుకూరలు, గుడ్లు, పప్పులు, మటన్, చికెన్, బచ్చలి, బ్రొకోలి, బీట్‌రూట్.. మొదలైన ఐరన్ నిచ్చే పదార్థాలు ఈ వయసుకు కీలకం.

బ్రేక్‌ఫాస్: ఉప్మా/పొంగల్/ ఇడ్లీ.. + ఒక గుడ్డు + గ్లాస్ పాలు

మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్/ రోటీ (2)+ పప్పు, ఆకుకూర, బీన్స్, పెరుగు

సాయంత్రం స్నాక్స్: బాదం/జీడిపప్పు/ఇతర డ్రై ఫ్రూట్స్‌తో చేసిన స్నాక్స్ (చిన్న మోతాదులో)+ అరటి పండు

రాత్రి భోజనం: రోటీ (2) లేదా మినప పిండితో చేసిన అట్టు +ఏదైనా కూరగాయ + నిమ్మరసం కలిపిన వెజ్ సలాడ్

2 యువతులకు (19-30 ఏళ్లు)

రుతుక్రమం చురుకుగా ఉండటం, సంతానోత్పత్తి ప్లానింగ్‌కి సరైన సమయం. ఈ దశలో...

ఐరన్ – ఫోలేట్ సమృద్ధిగా లభించే ఆకుకూరలు, అరటి మొదలైనవి తినాలి. ఒమేగా–3 యాసిడ్స్ ఉండే ఫ్లాక్స్ సీడ్స్, చేపలు, వాల్‌నట్స్‌ను కూడా చేర్చుకోవాలి.. పీచుపదార్థాలు ఉండే గోధుమ, కూరగాయలు, జామ వంటి పండ్లు తినాలి. కాల్షియం కోసం పాలు, పెరుగు, టోఫు వంటివి తీసుకోవాలి. జింక్ సమృద్ధిగా లభించే చిక్కుళ్లు లాంటివి.. ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

3 గర్భధారణ సమయంలో...

పిండం అభివృద్ధికి, తల్లి శక్తికి తీసుకోవాల్సినవి...

డాక్టర్ సలహాతో సప్లిమెంట్స్ + ఆకుకూరలు, నువ్వులు, దాల్చిన చెక్క, ప్రొటీన్ల కోసం గుడ్లు, పప్పులు, చికెన్, కాల్షియం - విటమిన్–ఇ కోసం పాల ఉత్పత్తులు, ఫైబర్‌కి పండ్లు, బ్రౌన్ రైస్, ఓమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్‌కి చేపలు, ఫ్లాక్స్ సీడ్స్.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి.

బ్రేక్‌ఫాస్ట్: గోధుమ రవ్వ/ ఓట్స్ ఉప్మా+ అరటి పండు + గ్లాసుడు పాలు

లంచ్: బ్రౌన్ రైస్ /రోటీ (2) / మెంతికూర పప్పు/ పెసరపప్పు+ బెండకాయ కూర, పెరుగు + కారట్/కీరా సలాడ్

సాయంత్రం స్నాక్స్: బాదం/వాల్‌నట్ (4 -5) +అరటిపండు / సపోటా

డిన్నర్: రొట్టెలు (2) / మినప దోస, బీన్స్ / సొరకాయ కూర + గ్లాస్ మజ్జిగ.

4 పాలిచ్చే తల్లులు

తగినంత శక్తిని తిరిగి పొందడానికి, పాల వృద్ధికి తీసుకోవాల్సినవి.. ఆకుకూరలు, బ్రోకలీ, కాలీఫ్లవర్, పండ్లు, లేత మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తులు, బీన్స్ తల్లులకు ప్రొటీన్ అందిస్తాయి. పాల ఉత్పత్తులు, నువ్వులు, ఆహారం జీర్ణం అవడానికి పల్చని మజ్జిగ మొదలైనవి తీసుకోవాలి.

బ్రేక్‌ఫాస్ట్: పెసరట్లు, అల్లం పచ్చడి+గ్లాసుడు పాలు/రాగి జావ **లంచ్:** బ్రౌన్ రైస్+ మటన్/ చికెన్‌కర్రీ, మెంతికూర పప్పు, పెరుగు, గోంగూర పచ్చడి. **సాయంత్రం స్నాక్స్:** జీరా రసం + బాదం/మెంతి లడ్డు, ఏదైనా ఒక పండు. **డిన్నర్:** రోటీ (2)/మినప రొట్టె, పల్లీలు, బచ్చలి కూర రాత్రి పడుకునే ముందు (ఒంటిగంట లోపల) గ్లాస్ నీళ్ల లేదా చిటికెడు పసుపు కలిపిన గోరువెచ్చని పాలు. బాగా ఆకలిగా అనిపిస్తే అర టేబుల్ స్పూన్ గుమ్మడికాయ గింజలు.

5 మెనోపాజ్ దశ

45 ఏళ్లు పైబడిన మహిళలు ప్లాన్ చేసుకోదగిన పోషకాహారంలో హార్మోన్ల సమతుల్యత, ఎముకల బలం, కోలెస్ట్రాల్ నియంత్రణ పై దృష్టి పెట్టాలి. కాల్షియం - విటమిన్–ఇ కోసం పాల ఉత్పత్తులు, సోయా, టోఫు వంటివి తీసుకోవాలి. చేపలు, ఫ్లాక్స్ సీడ్స్, పీచుపదార్థాలు ఉండే కూరగాయలు, పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు ఉండే బెర్రీస్, నాటు, తాటి బెల్లం, గ్రీన్ టీలను చేర్చుకొని చక్కెర, ఉప్పు తక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి... **బ్రేక్‌ఫాస్ట్: (ఉదయం 8:00 - 9:00):** ఓట్స్ + పాలు + కొద్దిగా వాల్‌నట్ లేదా బాదం (లేదా) రాగి దోస + పెసరపప్పు చట్నీ, ఒక అరటి పండు + గ్లాస్ నీరు. **మధ్యాహ్న భోజనం (లంచ్ - 1:00):** బ్రౌన్ రైస్ లేదా గోధుమ/జొన్న/సజ్జ రొట్టెలు, ఆకుకూరల పప్పు (గోంగూర, తోటకూర వంటివి), దుంపలు కాకుండా దొండకాయ/బీన్స్/బెండకాయ, సలాడ్ (కీరా, గాజర్), పెరుగు. **సాయంత్రం స్నాక్స్ (5:30 - 6:00):** గ్రీన్ టీ లేదా తులసి టీ (షుగర్ లేకుండా) నట్స్ (బాదం, నువ్వులు లేదా ఫ్లాక్స్‌సీడ్స్) (లేదా) ఆపిల్ / పియర్ / సపోటా **రాత్రి భోజనం (డిన్నర్ - 7:30 - 8:00):** గోధుమ రొట్టె (1-2). వెజిటబుల్ సూప్ లేదా తేలికగా జీర్ణం అయ్యే కూర (బెండకాయ, సొరకాయ వంటివి), మజ్జిగ (ఉప్పు తక్కువతో) తీసుకోవాలి.

సమతుల్యత అవసరం

ఓవర్ ఈటింగ్/ తక్కువ తినడం రెండూ సమస్యలు తెచ్చిపెట్టేవే. వ్యక్తి శరీర బరువు, శ్రమను బట్టి డైట్ ప్లాన్ చేసుకోవడం ఈ రోజుల్లో తప్పనిసరి. ప్రతి వ్యక్తికి వారి శరీర బరువు, జీవనశైలి, ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా డైట్ చార్ట్ ప్లాన్ చేసుకోవాలి. **ఉదాహరణ:** 50 ఏళ్ల మహిళ డైట్ చార్ట్. ● సమతుల్యత, ఎముకల ఆరోగ్యం, శక్తి ఉండేటట్లు డైట్ ప్లాన్ చేయాలి. **ప్రత్యేక సూచనలు:** ● రోజూ కనీసం 7,000 – 8,000 అడుగులు నడవాలి / యోగా / లైట్ స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. ఉప్పు, స్వీట్స్ తక్కువగా వాడాలి ● మెనోపాజ్ దశ కాబట్టి కాల్షియం, విటమిన్–ఇ విషయంలోప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పాల ఉత్పత్తులు తప్పనిసరి. 15 నిమిషాలు శరీరానికి సూర్యరశ్మి నేరుగా తాకేలా చూసుకోవాలి.

పిల్లలకు చెప్పాల్సిన మాయాబజార్ పాఠాలు



**'మీరు ఉద్దండ పండితులేగాని ఉండాల్సిన బుద్ధి మాత్రం లేదయ్యా' అంటాడు శకుని.
ర్యాంకులు వేరు... కామన్‌సెన్స్ వేరు...
ఈ సంగతి పిల్లలకు ఎవరు చెప్పాలి?
'ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి ఉండనే ఉంది' అంటాడు ఇదే శకుని.
ఈ చిట్కా చెప్పడానికి పెద్దలకు తీరిక ఎక్కడిది?
అస్మదీయులు ఎవరో తస్మదీయులు ఎవరో తెలుసుకోకపోతే పిల్లల అడుగులు పడేదెలా?
హాయ్ హాయ్ నాయకా.. హోయ్ హోయ్ నాయకా...
నాయకత్వ లక్షణాలు ఎవరికి ఉంటాయి?
తెలుగువారికి మాత్రమే ఉన్న వ్యక్తిత్వ వికాస సర్వస్వం 'మాయాబజార్' సినిమా.
ఈ సెలవుల్లో పెద్దలు పిల్లలతో ఈ సినిమా చూడాలి. వివరించాలి.**



'మాయాబజార్' 1957లో విడుదలైన గొప్ప తెలుగు చిత్రం. భారతంలోని పాత్రలకు కొద్దిపాటి కల్పన జత చేసి మలచిన ఈ సినిమా ఎందుకు ఇంతకాలం ఆదరణ పొందుతూ ఉందంటే అది ఎప్పుడూ ఒకేలా ఉండే మానవ స్వభావాలను చిత్రించింది కనుక. నేడు ఎదురుపడే మనుషులు ఎలా ఉంటారో ఈ సినిమాలో పాత్రలు అలా ఉంటాయి. అందుకే వాటితో తమను తాము ఐడెంటిఫై చేసుకున్న ప్రేక్షకులు ఎన్నో పాఠాలు నేర్చుకుంటారు. అర్థం చేసుకుంటారు. పిల్లలకు ఈ సినిమా గొప్ప వినోదంగా ప్రారంభమవుతుంది. ఐదేళ్ల వయసు పిల్లల నుంచి ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు. చూసేకొద్దీ ఎదిగే కొద్దీ వారికి సినిమా కొత్తగా అర్థమై మరింతగా నచ్చుతుంది. ఈ సినిమాకు ఫ్యాన్స్ అయిపోతారు. అలా తరతరాలుగా ఫ్యాన్స్ అయ్యేలా చేసుకుందీ సినిమా. గతంలో ప్రతి వేసవిలో ఈ సినిమా రీరిలీజ్ అయ్యేది. ఇప్పుడు ఓటిటీల్లో... యూట్యూబ్‌లో కలర్‌లో ఉంది. పిల్లలతో ఒకటికి రెండుసార్లు చూసి వారికి చెప్పాల్సిన పాఠాలు చాలానే ఉంటాయి.

1. బాల అభిమన్యు తన విలువిద్య గురించి ఇలా అంటాడు: అత్తయ్యా... నువ్వు జడవకుండా నుంచో... నీ ముక్కుకు తగలకుండా నత్తును కొడతాను.

పిల్లలకు చెప్పాలి: నత్తు అంటే ముక్కుకు పెట్టుకునే ఆభరణం. విలువిద్య నేర్చుకుని ఎవరైనా సరే పండునో కాయనో కొట్టగలరు... కాని ముక్కుకు తగలకుండా నత్తును కొడతానంటున్నాడంటే విలువిద్య చాలా గొప్పగా నేర్చుకున్నాడన్న మాట. మనం చదివినా, ఆటల్లో ప్రవేశించినా, కళల్లో ఉన్నా ఆ స్థాయి పరిణితి సాధించాలి. అభిమన్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి.

2. శ్రీకృష్ణుడు 'సత్యపీఠం' తీసుకువస్తాడు. అలాగే 'ప్రియదర్శిని' కూడా చూపిస్తాడు.

పిల్లలకు చెప్పాలి 'సత్యపీఠం' ఆనాటి లై డిటెక్టర్. మన పూర్వికులు శాస్త్ర పరంగా గొప్ప ప్రయోగాలు చేశారు. ఊహలు చేశారు. శాస్త్రజ్ఞుల ఊహలో లేని కాలంలో 'సత్యపీఠం' ఊహ చేయడం మనవారి గొప్పతనం. అలాగే వీడియో కాల్ చేసుకునేలా ల్యాప్‌టాప్ లాంటి 'ప్రియదర్శిని'ని చూపించారు. సైన్స్ దృష్టి కోణం నుంచి పురాణాలు చూస్తే చాలా ఇంటెరెస్టింగ్ విషయాలు తెలుస్తాయని చెప్పాలి.



3. శకుని పాచికలు వేస్తూ అంటాడు: ఈ పాచికలతో ఎవరినైనా సర్వనాశనం చేయగలను.

పిల్లలకు చెప్పాలి: జూదం వ్యసనం. అందులో మోసం ఉంటుంది. నష్టం ఉంటుంది. ఒక్కసారి వ్యసనాల్లో దిగితే తిరిగి రావడం కష్టం. నేటి రోజుల్లో ఆన్‌లైన్ గేమింగ్ కూడా అలాంటి వ్యసనమే. బెట్టింగ్ యాప్‌లు కూడా వ్యసనమే. ఆల్కహాల్, డ్రగ్స్ కూడా వ్యసనాలే. వ్యసనాల వల్ల పాండవులు రాజ్యాలను కోల్పోయారు. అందువల్ల ఎప్పుడూ వ్యసనాల జోలికి పోకూడదు.

4. శర్మ, శాస్త్రి వచ్చి లక్ష్మణ కుమారుణ్ణి పొగుడుతూ 'పురోగమించుట వారికి తెలుసు... తిరోగమించుట తమకు తెలుసు' అంటారు.

పిల్లలకు చెప్పాలి: గొప్పలు చెప్పుకోవడం, పొగడ్తలకు పడిపోవడం అల్పుల లక్షణం అని, లక్ష్మణ కుమారుడు అలాంటి వాడని చెప్పాలి. మనకు ఎంత ప్రతిభ ఉన్నా గొప్పలు చెప్పుకోకూడదని నేర్పాలి. లేని ప్రతిభ ఉన్నట్టుగా కల్పించి చెప్పి అభాసుపాలు కాకూడదని చెప్పాలి. మన బలహీనతను వాడుకుంటూ కొందరు చుట్టూ చేరి మోసం చేసి పబ్బం గడుపుతారనీ అలాంటి వారిని గుర్తించి దూరం ఉండాలి చెప్పాలి.

5. రాజ్యం పోయాక సుభద్ర వస్తే బలరాముని ఇంట్లో పరాభవం

పిల్లలకు చెప్పాలి: కొందరు మనుషులు అభిమానాన్ని బట్టి గాక స్థితిని బట్టి గౌరవిస్తారని, మనం కష్టంలో ఉంటే వారు అసలు రూపు చూపిస్తారని అలాంటి వారిని చూసి జాలి పడాలి తప్ప బాధ పడకూడదని నేర్పాలి. డబ్బుకు అతీతమైన విద్యాబుద్ధులు, వ్యక్తిత్వం శాశ్వతమని, వాటికే లోకంలో విలువ, గౌరవం అని చెప్పాలి.

6. ఘటోత్కచుడి ప్రవేశం

పిల్లలకు చెప్పాలి: మన దేశంలో అడవుల్లో జీవించేవారు ఉంటారని వారిని గిరిజనులు, ఆదివాసీలు అంటారనీ వారి కట్టు, బొట్టు, భాష, యాస, ఆచారాలు వేరని... మనం నాగరికులం అయినంత మాత్రాన వారిని చిన్నచూపు చూడకూడదని. వారెంతో మంచి వారని, అడవులు వారి ఆధారం అని వాటిని నరికి లాక్కుని వారికి హాని కలిగించడం తప్పు అని నేర్పాలి. 'అస్మదీయులు' అంటే ఫ్రెండ్స్ అనీ, ఆదివాసీలకు మనం అస్మదీయులుగా ఉండాలని చెప్పాలి.

7. దుష్ట చతుష్టయం

పిల్లలకు చెప్పాలి: దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు... వీరు నలుగురిని దుష్ట చతుష్టయం అంటారని చతుష్టయం అంటే నాలుగు అని చెప్పాలి. చెడు ఆలోచనలు చేసేవారితో స్నేహం చేస్తే మనం కూడా చెడ్డవాళ్లం అవుతామని చెడ్డపనులు చేయడం వల్ల ప్రమాదంలో పడతామని హెచ్చరించాలి.

8. గింబళి, గిల్పం కావాలని డిమాండ్

పిల్లలకు చెప్పాలి: స్నేహితులైనా, బంధువులైనా న్యాయమైన సాయం, కోరిక కోరితే నెరవేర్చాలని, అదే మన మంచితనం సాకుగా తీసుకుని గొంతెమ్మ కోరికలు కోరితే వారికి బుద్ధి చెప్పాలని నేర్పాలి. 'కంబళి', 'తల్పం' కాదని 'గింబళి', 'గిల్పం' కోరిన శర్మ, శాస్త్రులకు చిన్నమయ్య బుద్ధి చెప్పే దృశ్యాలు పిల్లలకు ఎంతగానో నవ్వు తెప్పిస్తాయి.

9. శాకంబరీదేవి ప్రసాదం- వివాహ భోజనంబు

పిల్లలకు చెప్పాలి: తెలుగువారి భోజనానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయని ప్రతి ప్రాంతానికీ సమూహాలకు వారివైన ఆహార అలవాట్లు ఉంటాయని, వాటిని గౌరవించాలని మన ఆహారపు అలవాట్లను పాటించాలని నేర్పించాలి. గోంగూరను శాకంబరీ దేవి ప్రసాదం అంటారని తెలుగువారికి గోంగూర ఇష్టమని చెప్పాలి. భక్ష్యాలు, చిత్రాన్నాలు, పానీయాలు, కూరగాయలు అంటే ఏమిటో వాటి తేడాలేమిటో చెప్తే సరదా పడతారు.


10. చినమాయను పెనుమాయ

పిల్లలకు చెప్పాలి: ఏ పనైనా నిజాయితీగా చేస్తే ఫలితం ఉంటుందని.. మాయతో కపటంతో శశిరేఖను లక్ష్మణ కుమారుడికి ఇచ్చి పెళ్లి చేయాలని కౌరవులు భావిస్తే శ్రీకృష్ణుడు, ఘటోత్కచుడు పెనుమాయతో ఆ పెళ్లిని పెటాకులు చేశారని... తగిన శాస్తి జరిగిందని... చెడ్డవాళ్లు ఎప్పటికీ ఓడిపోతారని, మంచితనంతో ఉంటేనే గెలుస్తామని బోధించాలి.

కె.

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

శ్రమైక జీవనం



కాల్చే ఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలు, దౌర్జన్యాలు... ఒంటి చేత్తో తోసిరాజని....

పనిలో తమను తాము నిరూపించుకున్నారు మహిళా కార్మికులు.

కార్మికలోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణగా నవీన శక్తిలా ముందుకు వచ్చారు మహిళా కార్మికులు.

శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతిబింబం అయ్యారు.

'ఈ రంగంలో మహిళలు పనిచేయలేరు' అనుకునే రంగాలలోకి వచ్చి అపోహలను బద్దలు కొట్టారు.

'పురుషులకు ఎక్కడా తీసిపోము' అని నిరూపించారు. నిరూపిస్తూనే ఉన్నారు. అయితే... ఇది నాణేనికి ఒక కోణం మాత్రమే. మరో కోణంలో చూస్తే మహిళా ఉద్యోగులు, కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

కోల్‌కత్తాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య మన దేశంలో ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించిన చర్చను ముందుకు తెచ్చింది. వివిధ సర్వేల ప్రకారం మూడింట ఒకవంతు మంది మహిళలు పని ప్రాంతంలో ఏదో ఒక రకమైన శారీరక హింసను ఎదుర్కొంటున్నారు.

మహిళా సిబ్బందికి వారి పని ప్రాంతంలో ప్రమాదాలు పెరిగాయి. చాలా ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా లేదు. సరైన నిఘా, రిపోర్టింగ్ యంత్రాంగం లేకపోవడంతో అనుచిత ప్రవర్తన, వేధింపులు పెరిగాయి. ప్రాథమిక భద్రతా చర్యల గురించి చాలా సంస్థలలో మహిళా ఉద్యోగులకు అవగాహన కలిగించడం లేదు.

గార్మెంట్ ఫ్యాక్టరీలలో ఎక్కువమంది కార్మికులు మహిళలే. అయితే పురుషులతో పోల్చితే వారికి తక్కువ వేతనం ఇస్తున్నారు. వేతన అసమానతలతో పాటు పనిప్రాంతంలో ప్రమాదాలు, పురుషాధిపత్య వేధింపులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలలో మహిళాకార్మికులకు మౌలిక సదుపాయాల కొరత ఉంది.

'బిజినెస్ అండ్ హ్యూమన్ రైట్స్' రిపోర్ట్ మన దేశంలో గార్మెంట్ ఫ్యాక్టరీలలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చింది. నిజానికి 'ఇది కేవలం గార్మెంట్ పరిశ్రమలకు సంబంధించిన రిపోర్ట్ మాత్రమే' అనుకోనక్కర్లేదు. చిన్నా, పెద్ద తేడాలతో ఎన్నో పరిశ్రమలలో వేరు వేరు రూపాల్లో ఇదే పరిస్థితి ఉంది.

కోవిడ్ మహమ్మారి ఉమెన్ హెల్త్ వర్కర్‌లకు ప్రమాదాలు తెచ్చింది. విధి నిర్వహణలో చనిపోయిన వారు కూడా ఉన్నారు. అయినా వెనక్కి తగ్గలేదు.

నిరాశ పడే పరిస్థితులు రావచ్చు, భద్రతాపరమైన సమస్యలు ఉండవచ్చు....ఒకటి, రెండు అని కాదు....సవాలక్ష సమస్యలు ఎదురైనా మహిళా శ్రామిక శక్తి వెనక్కి తగ్గడం లేదు.

ఎందుకంటే వారు...

చరిత్ర వింటూ వచ్చారు. మరో చరిత్ర నిర్మించాలనుకుంటున్నారు.